# వెయిట్ తగ్గించబడును

- ఎస్. లలిత



అప్పుడే స్నానం చేసి వచ్చి, లుంగీ కట్టుకుంటున్నాడు వెంకట్రావు. అతనికి వెనక నుంచి వచ్చి అమాంతం కౌగలించుకుంది కాంతం.

ఉన్నట్టుండి ఓ తొంభై కిలోల మనిషి మీద పడేసరికి భయపడి, కెవ్వుమని ఓ కేక వేసి, జారిపోతున్న లుంగీని పైకి లాగి పట్టుకున్నాడు..

''ఏంటి కాంతం.. ఈ సరసం. నేనెంత భయపడ్డానో...'' వీపు చరుచుకున్నాడు.

''అనండనండి. ఒకప్పుడు అయస్కాంతంలా నా నడుం చుట్టూ చేతులు వేసి అతుక్కుపోయేవారు..'' అంది రోషం పెల్లుబుకగా.

''అవును.. అప్పుడు నీ చుట్టుకొలత వేరు. ఇంతకీ ఏంటి విషయం?'' అడిగాడు.

కాంతం విసుగుని పక్కన పెట్టి ''మరేం లేదండీ.. మన రోడ్డు చివర '' ఆహా.. ఓహో' అని ఓ బ్యూటి క్లినిక్కు పెట్టారు. నెలలో కనీసం ఓ ఇరవై కిలోలన్నా తగ్గిస్తారుట. ప్లీజ్ నే వెళతానండీ..'' బ్రతిమాలే ధోరణిలో అడిగింది కాంతం.

''ఎంత లాక్కుంటారేంటి?''

''మీ కన్నీ వేళాకోళమే.. ఎంతో లేదు. ఓ తొమ్మిది వేలు. నాకోసం మీకదో లెక్కా....'' గోముగా అడిగింది.

చేసేదిలేక ఒప్పుకున్నాడు. లేకపోతే మళ్ళీ కాంతం బల ప్రయోగం చేస్తుందనే భయంతో.

:**

' ఆహా.. ఓహో' బ్యూటీ క్లినిక్కు..

వెంకట్రావు దంపతులు వెళ్ళేసరికి ఓ నలుగురైదుగురు అప్పటికే వెయిట్ చేస్తున్నారు.

రిసెప్షన్‌లో వున్న యువతి ఓ టోకన్ నెంబర్ ఇచ్చింది కాంతానికి.

కాంతం అక్కడ గది పరిశీలించటం మొదలెట్టింది. గదిలో కాస్ట్లీ ఫర్నిచర్, గోడలకు వెయిట్ తగ్గక ముందు, తగ్గిన తరువాత అంటూ కొందరి ఫోటోలు తగిలించి ఉన్నాయి. అవి చూసి తనూ స్లిమ్ అయినట్టు కల కనసాగింది.

ఇంతలో కాంతాన్ని లోపలికి పిలిచారు.

భారంగా నడుచుకుంటూ, స్ప్రింగ్ డోర్‌ని నెట్టుకుంటూ లోపలికి ఎంటర్ అయింది కాంతం.

అక్కడ మెరుపు తీగలాంటి అమ్మాయి కాంతాన్ని చూసి తీయగా నవ్వింది.

కాంతం కూడా నవ్వి ఆమె ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది.




ఆమె నవ్వుతూ– తాము ఫాలో అయ్యే విధానాలు పద్ధతులు వివరించసాగింది. కాంతం ఏదో ట్రాన్స్‌లోకి వెళ్ళినట్లు ఆమె చెప్పినదంతా వింది. ఆమె మాటలకే కాంతానికి సగం లావు తగ్గిన ఫీలింగ్ కలిగింది. అంతా విన్నాక...''మరి నేను మధ్యలో మానేస్తే..'' అని ఓ డౌట్ ఎక్స్‌ప్రెస్ చేసింది కాంతం.

''మీకే నష్టం. మళ్ళీ డబుల్ బరువు పెరుగుతారు. మళ్ళీ ట్రీట్‌మెంట్ మొదట్నించీ పుచ్చుకోవాలి'' అంది ఆ యువతి.

''అయితే నిజంగా నేను లావు తగ్గుతానంటారా..'' ఆశగా అడిగింది కాంతం.

''ష్యూర్. మిమ్మల్ని ఇవాళ ఆంటీ అని పిల్చినవాళ్ళే అక్కా అని పిలుస్తారు. గ్యారంటీ..'' తీయగా నవ్వుతూ అంది అక్కడి యువతి.

కాంతం ఆ మాటలకు ఐస్ అయిపోయింది.

''ఓకే. మరి నేను రేపట్నుంచే వస్తాను. మీ కన్సల్టేషన్ ఫీజు?'' అంది కాంతం హుషారుగా.

''రిసెప్షన్‌లో కట్టండి.''

కాంతం గాలిలో తేలిపోతున్నట్టుగా వచ్చింది రిసెప్షన్ కౌంటర్ దగ్గరికి. పర్సులోంచి డబ్బు తీస్తూ ''ఎంత'' అని అడిగింది.

''ఓ ఆరువందలు ఇచ్చుకోండి.'' అంది అక్కడ కూర్చున్న పిల్ల.

కాంతానికి మతిపోయింది. ఆరు నిముషాలు మాట్లాడినందుకు ఆరు వందలా అని మనస్సులో తిట్టుకుంటూ చేసేది లేక ఆరు వందలు సమర్పించింది.

అక్కడ్నుంచి ధుమధుమలాడుతూ బయటకు వచ్చిన భార్యను చూసి ''ఏంటన్నారు కాంతం'' భయంగా అడిగాడు వెంకట్రావు.

''నా బొందన్నారు. వాళ్ళ మొహం మండ.. ఆరు నిముషాలు వాగినందుకు ఆరువందలు గుంజారు. అంతా మోసం. రేపు నేను వస్తే నాలుగు సిట్టింగులయ్యాక తొమ్మిదికాదు.. పందొమ్మిది వేలు అని మాట మార్చినా మార్చేస్తారు. ఈ నంగనాచులు.'' అని తిట్ల వర్షం కురిపించింది కాంతం.

అప్పటికి ఖర్చు తప్పినందుకు మనస్సులో సంతోషించాడు.

***

మర్నాడు ఆఫీసునుంచి వచ్చేసరికి కాంతం మొహం చంద్రకాంతంలా విచ్చుకుంది.

'ఏదో విశేషం ఉండే ఉంటుంది.' అని మనసులో అనుకుని ఇంట్లోకి అడుగుపెట్టాడు.

కాంతం గబగబా వంటింట్లోకి వెళ్ళి కాఫీ కప్పు పట్టుకుని వచ్చింది.

''ఏవండీ మీకీ విషయం తెలుసా. బాలానగర్‌లో బాలమ్మ అనే ఆవిడ ఆకులతో తయారైన పౌడర్స్‌తో వెయిట్ తగ్గిస్తుందిట. రోజూ ఓ అర చెంచా పొడి నీళ్లలో కలుపుకుని తాగితే..నెలకి కనీసం పదికిలోలన్నా తగ్గుతారట...'' కాఫీ కప్పు వెంకట్రావు చేతికి అందిస్తూ, ఆయాసపడుతూ చెప్పింది కాంతం.

''ఇంకా నయం.. మోతాదు ఎక్కువైతే మనిషే కనిపించడు..'' అని అనబోయి ఆగిపోయాడు.

మళ్లీ ఇది ఎన్నివేలకి టెండరో అనుకుంటూ...''అవన్నీ ఒట్టి మాటలు కాంతం. అదే నిజమైతే మన హైదరాబాద్‌లో సగం మంది బక్కపీచులే ఉండేవారు. అయినా నువ్విప్పుడు ఏమంత లావున్నావని'' అన్నాడు నింపాదిగా.

''అదిగో మీరు నన్ను ఇన్‌డైరెక్ట్‌గా లావంటున్నారు. నేనంటే మీకిష్టం లేదు..'' అని ముక్కు చీదింది కాంతం.

''అయ్యో. అదేం లేదు. నువ్విప్పుడు ఏడుపు సీను పెట్టకు. ఆదివారం పొద్దుటే వెళదాం. సరేనా.'' అన్నాడు బ్రతిమాలే ధోరణిలో.

***

ఆదివారం పొద్దుటే తన పాత బజాజ్ స్కూటర్ మీద కాంతాన్ని ఎక్కించుకుని బాలానగర్ బయల్దేరాడు వెంకట్రావు.

ఓపక్క ట్రాఫిక్ ప్రాబ్లెమ్. మరో ప్రక్క స్కూటర్ ట్రబుల్‌తో విసుగొచ్చింది వెంకట్రావుకి. తనొక్కడే వెళితే పుష్పక విమానంలా పరుగులు తీసే స్కూటరు కాంతం ఎక్కేసరికి ఎద్దుబండిలా మారిపోయింది. మొత్తానికి ఓ గంట ప్రయాణం తర్వాత బాలమ్మగారింటికి చేరారు.

అప్పటికే అక్కడ పాతిక ముప్ఫైమంది దాకా ఉన్నారు. ఆలస్యం అయినందుకు కాంతం మొగుణ్ణి, స్కూటర్‌ని కలిపి జాయింట్‌గా తిట్టిపోసింది.

కాంతం వంతు వచ్చేసరికి ఉదయం పదకొండు గంటలైంది. గదిలోపల్నించి వస్తున్న ప్రతివాళ్ళనీ, బయట కూర్చున్నవాళ్ళు బాలమ్మగారు ఏమడిగారు, ఏ మందిచ్చారు.. ఇత్యాది ప్రశ్నలు వేస్తున్నారు.

ఒకావిడ అయితే...''ఇది చాలా పవర్‌ఫుల్ పౌడర్. ఖరీదు తక్కువే. ఎంతనుకున్నారు? కేవలం ఐదు రూపాయలే..'' అంది.

అక్కడందరు ఉబ్బితబ్బిబ్బయ్యారు. అలా ఆవిడ ఎందుకు అన్నదో లోపలికి వెళితే కానీ కాంతానికి అర్థం కాలేదు.

కాంతం గదిలోపలికి వెళ్ళేసరికి చల్లటి ఎ.సి.గాలి సేద తీర్చినట్టైంది. అప్పటిదాకా వెయిట్ చేయటం వలన కలిగిన అలసట మర్చిపోయింది.

''రామ్మా..రా.'' అంటూ బాలమ్మ నవ్వుతూ పలకరించింది. కాంతం ''నమస్తే'' అంది ఆవిడ ఎదురుగా కూర్చుంటూ.

ముందుగా ఆవిడ కాంతం బరువు చూసింది. ఆ తరువాత తీసుకోవల్సిన డైట్ వివరాలు చెప్పింది. టేబుల్ సొరుగులోంచి చూపుడు వేలంత సీసా పైకి తీసింది. అందులో ఆకుపచ్చని పౌడర్ ఉంది. ''చూడమ్మా ఈ పౌడర్ రోజూ ఉదయాన్నే ఓ అరచెంచా నీళ్ళలో కలుపుకుని తాగు. నేను చెప్పిన డైట్ తీసుకో. వారానికి కనీసం మూడు కిలోలన్నా తగ్గుతావు గ్యారంటీగా.'' అని విష్ణుమూర్తి లెవల్లో అభయహస్తమిచ్చింది.

ఆమె మాటలకు కాంతం మొహం చిచ్చుబుడ్డిలా వెలిగింది.

ఆ సీసా పుచ్చుకుని బ్యాగ్‌లో వేసుకుంది. ''ఫీజెంత?'' అడిగింది నవ్వుతూ.

''ఓ నాలుగువేలిచ్చుకో...'' చిద్విలాసంగా అంది బాలమ్మ. ప్రక్కలో బాంబు పడినట్టు ఉలిక్కిపడింది కాంతం.

''వేలెడెంత లేదు సీసా మందు. దీనికి నాలుగు వేలా?'' పళ్ళు కొరుక్కుంది. తప్పదుగా. బాగ్‌లోంచి నాలుగువేలు తీసిచ్చింది.

కాంతానికి మొదటగా కోపం వచ్చింది. ముందుగా వెళ్లివచ్చిన వాళ్ళంతా తనని ఫూల్ చేశారు. ఐదు, పది అని అబద్ధాలాడారు. వాళ్లకి తెలుసు. తామంతా పప్పులో కాలేసామని. ఆ విషయం తెలిస్తే మిగతావాళ్ళు జారుకుంటారని.. అంతా సాడిస్టులు. వాళ్లందరినీ తిట్టింది.

చిటపటలాడుతూ వచ్చిన భార్యను చూసి ''అదేంటి కాంతం. నీకు మందివ్వనందా..'' అమాయకంగా అడిగాడు వెంకట్రావు.

''ఛీ..అంతా మోసం. దగా. తీయగా మాట్లాడి

నా దగ్గర నాలుగువేలు గుంజింది. దీని కడుపు మండా...'' అంటూ తిట్లు ప్రారంభించింది.

వెంకట్రావు మారుమాట్లాడకుండా స్కూటర్ స్టార్ట్ చేసి కాంతాన్ని ఇంటికిచేరేశాడు.

***

వెంకట్రావుకి, భార్య లావు తగ్గాలన్న తపన చూస్తూంటే జాలివేస్తోంది. భయం వేస్తోంది. అసలు కాంతం వెయిట్ పెరగటానికి కారణం వెంకట్రావే.

అతనికి ఎన్ని సంబంధాలు చూసినా పిల్ల నచ్చటం లేదు. కారణం హైటు, వెయిటూ...అటు అక్కచూస్తే ఎనభై కిలోలు. ఇటు తల్లి చూస్తే డెబ్బయి కిలోలు. అందుకే అతను సన్నగా నాజూగ్గా ఉండే పిల్ల కోసం ముప్పై ఏళ్ళొచ్చినా వెతుకుతునే వున్నాడు. ఆ నేపథ్యంలో వెంకట్రావు ఎదురింటి వాళ్లింటికి చుట్టపు చూపుగా వచ్చింది కాంతం. సన్నగా, తీగలా ఉన్న కాంతాన్ని చూసి మనసు పారేసుకున్నాడు.

తల్లితో ఆ విషయం చెపితే...''పిల్ల నల్లగా ఉంది రా..'' అందావిడ.

''అయినా సరే. ఆమెనే చేసుకుంటాను'' అని పట్టుపట్టాడు. దాంతో వాళ్ళ పెళ్ళైంది.

కాంతం నాజూకుతనానికి మైమరచిపోయాడు వెంకట్రావు. సింహంలాంటి వంపున్న ఆమె నడుము చూసి మురిసిపోయాడు. అడిగిందల్లా కొనేవాడు. ఐస్‌క్రీములు, పిజ్జాలు, బర్గర్‌లు ఒక టేంటి కాంతం ఏం తినాలంటే అవి తినిపించాడు. ఫలితంగా వెంకట్రావు పర్సు సన్నబడింది. కాంతం ఒళ్ళు బరువెక్కింది.

బాలమ్మ దగ్గర నాలుగు వేలు పెట్టి కొన్నందుకు రోజూ ఆ పొడిని నీళ్ళలో కలుపుకొని తాగటం మొదలెట్టింది కాంతం. ప్రొద్దుట నాలుగు కీరదోస కాయ ముక్కలు, ఒక పుల్కా..మధ్యాహ్నం ఓ గ్లాసుడు మజ్జిగా, రాత్రి ఒక పుల్కా, సలాడ్.. ఈ విధంగా నాలుగు రోజులయ్యేసరికి..కాంతంకి శోష వచ్చింది. హాస్పిటల్‌లో చేర్పించి నాలుగు బాటిళ్ళు సెలైన్ పెట్టారు. కార్పొరేట్ ఆసుపత్రి అన్ని హంగులకు వీళ్ళ దగ్గర ఓ నాలుగువేలు గుంజింది. ఇవన్నీ చూసి ''ఇక చాల్లే. నువ్వు సన్నగా ఉన్నప్పటికంటే ఇప్పుడే అందంగా ఉన్నావు.'' అని వెంకట్రావు కాంతాన్ని మెచ్చుకోవటం మొదలెట్టాడు.

ఈ విషయం కాంతం మరిచిపోయేలోపే ఆమె స్నేహితురాలు వచ్చింది. కాంతం బాధ చూసి ''అసలిదంతా జరుగుతున్నది మీ ఇంటి వాస్తు వల్లే. ఇల్లు మారి చూడు, నువ్వు సన్నబడటం ఖాయం'' అని ఓ ఝలక్ ఇచ్చింది.

దాంతో కాంతం ఉన్నపాటున ఇల్లు వెతకమని వెంకట్రావుని ఒకటే పోరు పెట్టింది. వారం రోజులపాటు తిరగ్గ తిరగ్గా ఓ డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ దొరికింది వాళ్లకు.

వెంకట్రావు ఇల్లు మారిన నాలుగు రోజులకు పైకి నల్లా నీళ్లురాలేదు. అద్దె తక్కువని సెకండ్ ఫ్లోర్‌లో ఇల్లు తీసుకున్నాడు.

అప్పట్నించీ కాంతానికి నీళ్ళు మోయటమే పని అయింది.

అలా పది రోజులు గడిచేసరికి లిఫ్ట్ పనిచేయడం మానేసింది. దాని గురించి ఎవరూ పట్టించుకోరు. రెండతస్తులు రోజూ నీళ్ళు మోయాల్సి వచ్చింది కాంతానికి. ఈ హడావిడిలో కాంతం తన వెయిట్ గురించి మర్చిపోయింది.

రోజూ ఇంట్లో పని, నీళ్ళు మోయటం, నాలుగైదుసార్లు మెట్లెక్కి దిగటంతో రోజులు గడిచిపోతున్నాయి.

కాంతం అవస్థ చూసి వెంట్రావు ''పోనీ ఇల్లు మారదామా'' అన్నాడు ఒకరోజు.

''వద్దులేండి. ఇక్కడ నీళ్ళ పుణ్యమా అని నేను ఐదు కిలోలు తగ్గాను. ఇంకా ఇలాగే కంటిన్యూ అయితే మీకిదివరకటి కాంతాన్ని చూడచ్చు...'' అంది కాంతం గోముగా.

వెంకట్రావు అప్పుడే గమనించాడు. కాంతం కాస్త సన్నబడింది. పైగా భార్య నాచురల్‌గా లావు తగ్గ ప్రయత్నం చేస్తుందనేసరికి, ముచ్చటేసి ఆమెను కౌగిలించుకున్నాడు.

ఇప్పుడు అతని చేతులు ఆమె చుట్టుకొలతను చుట్టుకోగలిగాయి. కాంతం, వెంకట్రావుని కాస్త బలంగా పట్టుకుంది. ఇప్పుడు వెంకట్రావుకి ఊపిరి ఆడుతోంది. భార్య ఇప్పుడు వెనకటి కాంతంలా అన్పిస్తోంది. ఆనందంతో అతను కళ్ళుమూసుకున్నాడు మైమరచిపోతూ.

★

